క్లుప్తంగా

ఏకోపాధ్యాయ స్కూళ్ల మూత

దొరవారిసత్రం : మండలంలోని 28 ఏకోపాధ్యాయ పాఠశాలలు శనివారం మధ్యాహ్నం నుంచి మూతపడ్డాయి. ఏకొల్లు, కల్లూరు, పూలతోట, తల్లంపాడు, ఉచ్చూరు, శ్రీధనమల్లి కాంప్లెక్స్ పరిధిలోని 51 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 28 పాఠశాలల్లో ఒక్కో ఉపాధ్యాయుడు మాత్రమే పనిచేస్తున్నారు. ప్రతి నెలా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహిస్తున్న సమయంలో మధ్యాహ్నం నుంచి పాఠశాలలు మూతపడుతున్నాయి. ఏకో ఉపాధ్యాయుడు ఉన్న పాఠశాలలకు మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని పలుమార్లు కోరినా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టడం లేదని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు.

కంప్యూటర్ల వితరణ



గూడూరు రూరల్ : గూడూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు శనివారం రోటరీ క్లబ్ సభ్యులు మూడు కంప్యూటర్లు అందజేశారు. రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ చైర్మన్ మునిగిరీష్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థి చదలవాడ మురళీధర్ రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ చైర్మన్‌గా పని చేస్తున్నారని తెలిపారు. ఆయన తాను చదివిన పాఠశాలకు మూడు కంప్యూటర్లు ఇచ్చేలా ఇక్కడి రోటరీ క్లబ్ ద్వారా ఏర్పాటు చేశారని తెలిపారు. రోటరీ క్లబ్ సభ్యుడు మల్లు విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చిల్లకూరులో..



చిల్లకూరు : పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలల అభివృద్ధి సహకారం అందించడం అభినందనీయమని చింతవరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివసుబ్రమణ్యం తెలిపారు. చింతవరం జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ ఉలసా నారాయణ శనివారం రూ.15 వేల విలువ చేసే కుర్చీలు వితరణ చేశారు. డాక్టర్ ఉలసా నారాయణ మాట్లాడుతూ చదువు చెప్పిన గురువులను, పాఠశాలను ఎన్నటికీ మరువకూడదన్నారు. ఇంకా ఏవైనా అవసరాలు ఉంటే సహకారం అందిస్తామన్నారు.

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం

నాయుడుపేట టౌన్ : ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం మండలాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దుతామని మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎంపీపీ ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో భువనేశ్వరశర్మ, జెడ్పీటీసీ కట్టా జ్యోతిరెడ్డి, వైస్ ఎంపీపీలు అత్తికాయల కృష్ణవేణి, నెలవల మమత, పల్లమాల రామిరెడ్డి పాల్గొన్నారు.

పోటాపోటీగా క్రికెట్ పోటీలు

వెంకటగిరి రూరల్ : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని తారకరామ క్రీడా మైదానంలో సౌత్‌జోన్ సీనియర్ విభాగం క్రికెట్ పోటీలు పోటాపోటీగా జరుగుతున్నాయి. శనివారం అనంతపురం- కర్నూలు జట్లు తలపడ్డాయి. కర్నూలు జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 43.1 ఓవర్లకు 165 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 38 ఓవర్లకు 182 పరుగులు చేసి 4 వికెట్లు కోల్పోయింది. 17 పరుగుల తేడాతో అనంతపురం జట్టు లీడ్‌లో ఉంది.

రోడ్డు ఆక్రమణల తొలగింపు

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా సహకరించాలని వెంకటగిరి సీఐ వెంకటరమణ కోరారు. ఆయన శనివారం రాజావీధి, తూర్పువీధి, పాతబస్టాండ్ వీధి తదితర రోడ్లలో దుకాణాల ముందు ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారులు రోడ్డును ఆక్రమించుకుని ట్రాఫిక్ సమస్యను సృష్టిస్తున్నారని తెలిపారు. రోడ్డు మీదకు రాకుండా చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా పట్టణంలో ఉన్న ఆటో డ్రైవర్లను పోలీసు స్టేషన్‌కు పిలిపి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ జిత్యానాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న నాగేంద్రకుమార్

వెంకటగిరి(సైదాపురం) : బంగారుపేట పీహెచ్‌సీని శనివారం జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యుడు నాగేంద్రకుమార్ శనివారం తనిఖీ చేశారు. వైద్య సేవలపై సిబ్బందితో సమీక్షించారు. గర్భిణులు, బాలింతలకు తగిన వైద్య పరీక్షలు చేయాలన్నారు. పాఠశాలల్లో శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు వైద్య సేవలు అందించాలని సూచించారు. డీపీహెచ్‌ఎన్‌వో బేబీరాణి, డీపీవో ప్రకాష్, మెడికల్ ఆఫీసర్ శివకుమార్‌రెడ్డి, సూపర్‌వైజర్ సుశీల, ఏఎన్‌ఎం శోభ పాల్గొన్నారు.

కలగానే రోడ్డు విస్తరణ

రోడ్లు బాగుంటే ప్రయాణం సులువవుతుంది. రవాణా పెరిగి గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గుతాయి. ఈ విషయం తెలిసినా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో కొన్ని రోడ్లు నరకానికి దారులుగా మారుతున్నాయి. సూళ్లూరుపేట-శ్రీకాళహస్తి రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డు మీద ప్రయాణం చేయాలంటే చిన్న చిన్న వాహనాలే కాకుండా పెద్ద వాహనాల డ్రైవర్లు సైతం భయపడిపోతున్నారు. వాహనాల సంఖ్య పెరిగినా విస్తరణపై పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- అధ్వానంగా సూళ్లూరుపేట-శ్రీకాళహస్తి రోడ్డు
- తరతరాలుగా సింగిల్ రోడ్డే దిక్కు
- ట్రాఫిక్ పెరిగినా విస్తరణకు నోచుకోని వైనం



మార్జిన్లు కూడా కనిపించని సూళ్లూరుపేట- శ్రీకాళహస్తి రోడ్డు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట-శ్రీకాళహస్తికి వెళ్లే మార్గంలో బుచ్చినాయుడుకండ్రిగ వరకు 19.5 కిలోమీటర్లు రోడ్డు నాలుగైదు దశాబ్దాలుగా సింగిల్ రోడ్డుగానే వుంది. పదేళ్ల క్రితం వరకు ఈ రోడ్డుపై అంతగా ట్రాఫిక్ వుండేది కాదు. ఇప్పుడు రోజుకు 10 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. చెన్నై-కోల్‌కతా ఏషియన్ రహదారి నుంచి సుమారు 6 కిలోమీటర్ల మేర సూళ్లూరుపేట నియోజకవర్గం పరిధిలో వుంది. 13.5 కిలోమీటర్ల రోడ్డు సత్యవేడు నియోజకవర్గ పరిధిలో వుంది. రోజుకు 7 వేల నుంచి 10 వేల వాహనాలు వెళుతున్నట్టు ఆర్‌అండ్ బీ అధికారుల సర్వేలో తేలింది. నాలుగు వేల వాహనాల వరకు తిరిగితే దాన్ని డబుల్ రోడ్డు చేయాలని నిబంధనలున్నాయి. దీనిపై సూళ్లూరుపేట ఆర్‌అండ్‌బీ అధికారులు సర్వే చేసి సుమారు రూ.30 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. గత ప్రభుత్వంలో కల్వర్టులున్న ప్రాంతాల్లో విస్తరణ చేపట్టారు. అలాగే సూళ్లూరుపేట నుంచి పెరిమిటిపాడు వరకు ఆరు కిలోమీటర్లను డబుల్ రోడ్డు చేశారు. ఎన్నికలు రావడంతో మిగిలిన 13.5 కిలోమీటర్ల రోడ్డు పనులు ఆగిపోయాయి. సింగిల్ రోడ్డు కావడంతో ప్రమాదాల సంఖ్య పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు దారుణంగా తయారైంది. జంగిల్ క్లియరెన్స్ కూడా చేయకపోవడంతో పాటు రోడ్డు మార్జిన్లు కూడా కనిపించడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వారంలో నాలుగైదు ప్రమాదాలు జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారుల్లో చలనం లేకుండా పోయింది. ఇటీవల ఈ రోడ్డులో రెండు మూడు కంపెనీలు రావడంతో పాటు 1,827 టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీలు కూడా వెలిశాయి. ఈ



సూళ్లూరుపేట-శ్రీకాళహస్తి రోడ్డులో ఎదురెదురుగా రావడానికి ఇబ్బంది పడుతున్న వాహనాలు

క్రమంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే మృత్యువుతో పోరాడినట్టుగా ఉంటోందని ప్రయాణికులు వాపోతున్నారు. రాత్రిళ్లు ద్విచక్ర వాహనాల్లో వెళ్లాలంటే ఇంటికి చేరేదాకా నమ్మకం లేకుండా పోయింది.

డబుల్ రోడ్డు నిర్మాణమెప్పుడో..?

ఈ సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు మంచిరోజులెప్పుడు వస్తాయోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం సూళ్లూరుపేట నియోజకవర్గం నెల్లూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లా పరిధిలోకి మారింది. ప్రస్తుతం జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఈ మార్గం గుండానే వెళ్లాలి. ఈ రోడ్డులో సూళ్లూరుపేట- శ్రీకాళహస్తి వాసులతోపాటు మన్నారుపోలూరు, ఇలుపూరు, పెరిమిటిపాడు, కొండుంబట్టు, మంగళంపాడు, దామానెల్లూరు, మతకామూడి, ఉగ్గుమూడి, సుగ్గుపల్లి గ్రామాల ప్రజలే కాకుండా జిల్లా పరిధిలోని బుచ్చినాయుడు కండ్రిగ, సంతవేలూరు, కువ్వాకొల్లి, గాజుల పెళ్లూరు, పాధనవారిపాళెం, అయ్యవారిపాళెం, కళత్తూరు, వరదయ్యపాళెం, మరదవాడ గ్రామాల ప్రజలు సూళ్లూరుపేటకు రాకపోకలు సాగిస్తున్నారు. అపాచి కంపెనీకి వెళ్లే ఈ గ్రామాల ప్రజలందరూ ఈ ప్రమాదకరమైన మార్గం గుండా ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మార్గంలో అనేక ప్రమాదాలు జరిగి చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది క్షతగాత్రులయ్యారు. ఇంత జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు గాని, జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులకు గాని చీమకుట్టినట్టయినా లేకుండాపోయింది.

భయం భయంగా వెళ్లాల్సి వస్తోంది



ఈ రోడ్డులో బైక్‌పై వెళ్లాలంటే భయంగా ఉంటోంది. రోడ్డులో తారు లేచిపోయి మోకాటిలోతు గుంతలేర్పడ్డాయి. వర్షాలు కురిస్తే ఏ గుంత ఎంత లోతు వుందో కూడా తెలియక కింద పడిపోయి గాయాలపాలవుతున్నారు. ఇటీవల అపాచి కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. నా చిన్నప్పటినుంచి ఈ రోడ్డు సింగిల్‌గానే ఉంది. డబుల్ రోడ్డు ఎప్పుడవుతుందో..?

– దామతోటి లక్ష్మయ్య, వెలగలపొన్నూరు

నరకం కనిపిస్తోంది



రాత్రిళ్లు ఈ రోడ్డులో సూళ్లూరుపేట నుంచి మన్నారుపోలూరు వెళ్లాలంటే నరకం కనిపిస్తోంది. ఈ మార్గంలో రెండు కంపెనీలు రావడంతో పాటు ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. రోజుకు పదివేలు వాహనాలు దాకా రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు విస్తరణ చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కల్వర్టులు విస్తరించి ఆరు కిలోమీటర్లు డబుల్ రోడ్డు వేశారు.

– ఒరుగు సుబ్రమణ్యంరెడ్డి, సుగ్గుపల్లి

పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని ఆందోళన



నిరసన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

సైదాపురం: పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయా లని కోరుతూ విద్యార్థులు శనివారం ఏఐఎస్‌ఏ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కలిచేడులో ఆందోళన చేశారు. తుమ్మలతలుపూరు, కలిచేడు గ్రామాల్లో ఉన్న మైకా మైన్స్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఇప్పటి వరకు పుస్తకాలు ఇవ్వలేదు. దీంతో తాము ఎలా చదువుకోవాలని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. షఫీ హరర్ పాల్గొన్నారు.

బారికేడ్ల ఏర్పాటుపై గ్రామస్తుల ఆగ్రహం

పెళ్లకూరు: చిల్లకూరు వడ్డిపాళెం వద్ద జాతీయ రహదారిపై బారికేడ్లు(ఐరన్ కంచె) ఏర్పాటుచేయడంపై స్థానికులు శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. 71వ జాతీయ రహదారి ఆరులేన్ల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మూగజీవాలు రాకుండా ఐరన్ కంచె ఏర్పాటు చేస్తున్నారు. తాము రోడ్డుపైకి రావాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుందని, కంచె ఏర్పాటు చేయవద్దని అడ్డుకున్నారు. దీంతో గ్రామస్తులు, కంపెనీ ప్రతినిధుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

రేషన్ బియ్యం, మినీ లారీ సీజ్

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలో శనివారం రాత్రి రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న మినీ లారీని పోలీసులు సీజ్ చేశారు. పాగొట్టం కాలనీలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని రేషన్ బియ్యం లోడుతో ఉన్న మినీ లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీలో 30 బస్తాలలో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. పూర్తి స్థాయిలో విచారిస్తున్నట్లు తెలిపారు.

పొమ్మనకుండా పొగబెట్టారు

- మేట్లకు లాగిన్ ఇచ్చి ఎఫ్ఏలను తొలగించే ప్రయత్నం
- జిల్లా అధికారులు స్పందించాలని ఫిర్యాదు



పెళ్లకూరులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

పెళ్లకూరు : టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించేందుకు ప్రయత్నాలు చేపట్టారు. ఇందులో భాగంగా పొమ్మనకుండా పొగబెట్టినట్టు ఎఫ్ఏలను కాదని అనర్హులైన మేట్లకు లాగిన్ ఇచ్చారు. దీనిపై స్థానికులు మండిపడుతున్నారు. మండలంలోని 24 పంచాయతీల్లో 9,010 జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రతిఏటా సుమారు రూ.7.12 కోట్లకు పైగా ఉపాధి నిధులతో పనులు కల్పిస్తున్నారు. దీంతో కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై దృష్టిసారించారు. తమ వాళ్లను పెట్టుకోవాలని నిర్ణయించుకున్నారు. వారికి ఉపాధి హామీ మండల స్థాయి అధికారి తోడయ్యారు. ఆయన అత్యుత్సాహంతో టీడీపీ నేతల మెప్పుపొందేందుకు తనకు అనుకూలంగా లేని ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో కొత్తగా మేట్లను నియమించి వారికి లాగిన్ ఇచ్చారు. దీనిపై స్థానికంగా పెద్ద దుమారం రేగుతోంది. మండల స్థాయి అధికారి ఊరూరా అధికార పార్టీ నాయకులతో మాట్లాడడం, కొత్తవారిని నియమించుకోవాలంటూ సలహాలు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిది మాసాల్లో ఉద్యోగ విరమణ చేయనున్న తరుణంలో ఆ అధికారి విభిన్న ధోరణితో వ్యవహరిస్తూ ఎఫ్ఏలను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో మేట్లను నియమించి లాగిన్ ఇచ్చారు. స్వతహాగా తప్పుకుంటారా? లేదా గడిచిన పదేళ్లలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై తనిఖీ చేసేలా జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయమంటారా అంటూ బెదిరింపులకు దిగుతున్నట్టు సమాచారం. ఆ అధికారి వికృత చేష్టలపై జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికే పలుమార్లు మొట్టికాయలు వేసినా తీరు మారలేదు. జిల్లా ఉన్నతాధికారులు మరోమారు ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజలకు సేవ చేయడం అభినందనీయం

నాయుడుపేట టౌన్ : మాజీ మంత్రి పరసా రత్నం తన సతీమణి పరసా కస్తూరి జ్ఞాపకార్థం ప్రజలకు సేవలు చేయడం అభినందనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయులు తెలిపారు. ఆయన శనివారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి పరసా కస్తూరి వర్ధంతి సందర్భంగా నాయుడుపేటలోని ఏఎల్‌సీఎం గ్రౌండ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మెగా వైద్య, రక్తదాన శిబిరాలను ప్రారంభించారు. పరసా కస్తూరి రత్నం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్య శిబిరంలో రోగులకు కంటి పరీక్షలతోపాటు, స్త్రీలకు క్యాన్సర్ నిర్ధారణ, గుండె, శ్వాసకోశ, మెదడు, వెన్నెముక, నరాలు, ఎముకలు, కీళ్ల తదితర పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. పేదలకు అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే పరసా రత్నం, షాలినీ రత్నం, సతీష్ చంద్ర, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంబేటి విజయ భాస్కర్ రెడ్డి, పల్లమాల రామిరెడ్డి పాల్గొన్నారు.

తొగరాముడి వీఆర్‌ఏ మృతి



వీఆర్‌ఏ శ్రీనివాసులు

దొరవారిసత్రం : మండలంలోని తొగరాముడి వీఆర్‌ఏ పి.శ్రీనివాసులు మృతిచెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయన మృతికి తహసీల్దార్ శైలకుమారి, డీటీ గోపీనాథ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్‌ఏలు సంతాపం ప్రకటించారు.

పేరెంట్స్ కమిటీల ఎన్నికపై టీడీపీ పెత్తనం



చిల్లకూరు : ఓడూరు పాఠశాల వద్ద తల్లిదండ్రులను పరిశీలించి పంపుతున్న పోలీసులు

చిల్లకూరు : మండలంలోని పారిచెర్లవారిపాళెం, ఓడూరు పాఠశాలల్లో శనివారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల ప్రక్రియను ఎంఈవో-1 సనత్ కుమార్, ఓడూరులో ఎంఈఓ-2 ఎన్నికల ప్రక్రియ చేపట్టారు.ఇందులో టీడీపీ నేతలు పెత్తనం చెలాయించేందుకు ప్రయత్నాలు చేశారు. ఓడూరులో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు ఎక్కువ మంది ఉన్నారని భావించిన టీడీపీ నేతలు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్‌తో తనిఖీలు చేసి తల్లిదండ్రులను పాఠశాలలోకి పంపించారు. 23 మంది హాజరు కాగా వారిలో 15 మంది వైఎస్సార్ సీపీ మద్దతుదారులు. దీంతో టీడీపీ నేతలు ఎన్నికలను బహిష్కరిస్తున్నామని నానాయాగీ చేశారు. దీనిపై ఎంఈవో-2 రవూఫ్ వివరణ ఇస్తూ ఎన్నిక విషయాన్ని డీఈవో దృష్టికి తీసుకెళ్లగా వాయిదా వేయాలని సూచించారని తెలిపారు. పారిచెర్లవారిపాళెంలో తల్లిదండ్రులను పాఠశాలలోకి వెళ్లకుండా కూటమి నేతలు బెదిరించి ఒక్క ఓటు మెజార్టీ వచ్చేలా చేశారు. పాఠశాలల్లో రాజకీయాలు చేయడం దారుణమని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోటలో..

కోట : మండలంలోని గోవిందపల్లి హైస్కూల్‌లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరగకుండా టీడీపీ నేతలు అడ్డుతగలడంతో వాయిదా వేస్తున్నట్టు ఎంఈవో మస్తానయ్య తెలిపారు. టీడీపీ నేతలు విద్యార్థుల తల్లిదండ్రులను బయటపెట్టి పాఠశాల వద్దకు రాకుండా అడ్డుకున్నారని వైఎస్సార్ సీపీ నేతలు ఆరోపించారు.

సైదాపురంలో..



సైదాపురం: హెచ్‌ఎంతో మాట్లాడుతున్న ఎంఈవో

సైదాపురం : స్థానిక ఉన్నత పాఠశాలలో ఈ నెల 8న 3, 4, 5, 7 తరగతులకు మాత్రమే ఎన్నికలను నిర్వహించారు. ఇద్దరు వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు, 10 మంది టీడీపీ కూటమి వారు ఎన్నికయ్యారు. హెచ్‌ఎం వాసుదేవరావు అధ్యక్షతన శనివారం 6, 8, 9, 10 తరగతులకు ఎన్నికలు చేపట్టగా 12 మంది వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు ఎన్నికయ్యారు. మొత్తం 24 మంది వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు ఉండడంతో తాము ఓడిపోతామని భావించిన టీడీపీ వారు ఎన్నికలను రద్దు చేయాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో కొంత సేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఎంఈవో దయాకర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ సర్దిచెప్పడానికి ప్రయత్నించినా ఫలితం లేదు. ఎంఈవో-2 సుప్రియ అక్కడికి చేరుకుని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎన్నిక చేపట్టారు. 24 మంది సభ్యుల్లో 14 మంది వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు ఉండడంతో కమిటీ చైర్మన్‌గా మల్లారపు నీరజను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రహంతుల్లా ఎన్నికయ్యారు.

చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు





ట్రాక్టర్లకు మట్టిని లోడ్ చేస్తున్న జేసీబీ, మట్టి తవ్వ ప్రాంతంలో అడ్డుకుంటున్న గ్రామస్తులు

చిల్లకూరు : మండలంలోని బూదనం గ్రామంలో శనివారం ఆలయానికి చెందిన చెరువులో అధికార పార్టీ నేతల అండతో కొందరు అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు తవ్వకాలను అడ్డుకున్నారు. బూదనంలో బాపన చెరువు ఆలయానికి చెందినది. ఒక వ్యక్తి టీడీపీ నేతల అండతో నిర్మాణానికి మట్టిని చెరువు నుంచి తరలించేందుకు ప్రయత్నించాడు. యంత్రాలతో తవ్వకాలు చేట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి వారిని అడ్డుకున్నారు. తమకు అనుమతులు ఉన్నాయని వారు చెప్పడంతో అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అక్కడికి చేరుకుని యంత్రాలను అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అటవీ అధికారులు అటవీశాఖకు చెందిన భూమి చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేశారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు



ఈవోపీఆర్డీకి ఫిర్యాదు చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

చిట్టమూరు(చిల్లకూరు) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో పంచాయతీ కార్యదర్శి పరంధామయ్య తనను అవమానించారని మండలంలోని మెట్టు ఉప సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఆయన శనివారం ఈవోపీఆర్డీ మనోహర్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సం రోజు ప్రజాప్రతినిధులు జాతీయ జెండాను ఎగురవేస్తారని తెలిపారు. తల్లి అనారోగ్యం కారణంగా తాను హాజరుకాలేనని మెట్టు సర్పంచ్ సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. సర్పంచ్ తర్వాతి ఉప సర్పంచ్ అయిన తనకు కనీస సమాచారం ఇవ్వకుండానే పంచాయతీ కార్యదర్శి సచివాలయం ఎదుట జాతీయ పతాకాన్ని ఎగురవేశారని పేర్కొన్నారు. ఈ విషయంపై అడిగితే తనకు దురుసుగా సమాధానం ఇచ్చారని తెలిపారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తామని ఈవోపీఆర్డీ తెలిపారు.

గురుకులాలకు ఇన్వర్టర్, మోటార్ అందజేత



ప్రిన్సిపాళ్లకు చెక్కు, మోటార్లు అందజేస్తున్న 786 సేవా సంఘం సభ్యులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంతో పాటు బిరదవాడ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలురు, బాలికల గురుకుల పాఠశాలలకు శనివారం 786 సేవా సంఘం సభ్యుడు షేక్ రఫీ ఇన్వర్టర్, మోటార్లు అందజేశారు. విద్యుత్ సరఫరా లేని సమయంలో పిల్లలు చదువుకునేందుకు ఇబ్బంది పడుతున్నట్లు ప్రిన్సిపాళ్లు రూత్ రోమాల, దారాపీర్ తెలిపారు. మరుగుదొడ్లు శుభ్రం చేసుకునేందుకు మోటార్, 60కు ఫ్యాన్లకు మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ క్రమంలో సపందించిన రఫీ తమ సేవా సంఘం తరఫున రూ.50 వేలకు పైగా విలువ చేసే ఇన్వర్టర్, మోటార్లు అందజేశారు. ఫ్యాన్ల రిపేరుకు చెక్కు ఇచ్చారు. 786 సేవా సంఘం సభ్యులు ఎస్‌డీ షరీఫ్, మొహమ్మద్, షేక్ అమీర్, ఉపాధ్యాయులు శేఖర్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



గూడూరు ఆస్పత్రి ఆవరణలో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

రాపూరు: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని స్థానిక వైద్యాధికారిణి నర్మదాదేవి, సిబ్బంది డిమాండ్ వారు శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమించే వైద్యులకు రక్షణ లేకుండా పోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం నిందితులను కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శ్యామ్ సుందరరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు సరస్వతి, మమత, హరీష్, గౌతమ్, రేష్మ, నజీమ్, షాహీనా పాల్గొన్నారు.

కోటలో..

కోట : కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన అమానుష ఘటనను నిరసిస్తూ కోట సీహెచ్‌సీ వైద్యులు శనివారం నిరసన తెలిపారు. రెండు గంటల పాటు విధులను బహిష్కరించారు. డాక్టర్లు రూప, రాజశేఖర్‌రెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, గీతామాధురి, పృథ్వీ పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది నిరసన

గూడూరు రూరల్ : కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ గూడూరు ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది శనివారం నిరసన తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ షరీనా మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులు, సిబ్బందికి రక్షణ లేకపోతే వైద్యం ఎలా అందించాలని ప్రశ్నించారు. కోల్‌కతాలో డాక్టర్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. వారికి ప్రైవేట్ వైద్యులు కూడా మద్దతు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు జనార్ధనరెడ్డి, రోహిణి, మైథిలి, రాజా, హరిక్రిష్ణ, స్వరాజ్యం, రామక్రిష్ణారావు, తనూజ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

సైదాపురం: జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సైదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణులు శ్రావణి, ప్రశాంతి డిమాండ్ చేశారు. వారు శనివారం వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ చేశారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వెంకటగిరి సెక్రటరీ డాక్టర్ సంజీవరాయుడు డిమాండ్ చేశారు. అసోసియేషన్ సభ్యులు, వైద్యులతో కలిసి నిరసన ర్యాలీ చేశారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, డీటీకి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు జిలాని, సిబ్బంది సీహెచ్‌సీలో నిరసన తెలిపారు. వైద్యులు పియూషా, వసుంధర పాల్గొన్నారు. స్త్రీ విముక్తి సంఘటన, రైతు కూలీ సంఘం నేతలు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

కోటలో..

కోట: కోల్‌కతాలో డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులకు ఉరిశిక్ష విధించాలని ప్రైవేట్ హాస్పిటల్ వైద్యులు డిమాండ్ చేశారు. వారు శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. 24 గంటల పాటు నాన్ ఎమర్జెన్సీ వైద్యసేవలను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్లు రామక్రిష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జగదీష్, దివ్యప్రియ, సుందరరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : కోల్‌కతాలో డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను ఉరి తీయాలని డాక్టర్లు డిమాండ్ చేశారు. నాయుడుపేటలోని ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల డాక్టర్లు శనివారం పాత బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవ హారం ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి ర్యాలీగా పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని ఎస్‌ఐ గోపికి వినతి పత్రం అందజేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు ఆదివారం ఉదయం వరకు వైద్య సేవలను నిలిపివేస్తున్నట్టు తెలిపారు. నాయుడుపేట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ చంద్రకళ, వైద్యులు హరిప్రియ, శ్రీధర్ రెడ్డి, రామసుబ్బయ్య, వెంగయ్య, వెంకటరత్నం, బ్రహ్మయ్య, చైతన్య స్రవంతి, గోపీకృష్ణ, ఆదవరం సందీప్, బాబి, శివకృష్ణ, దీప్తి, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఏబీవీపీ నాయకులు విద్యార్థులతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు.

బాలాయపల్లిలో..

బాలాయపల్లి(సైదాపురం): కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బాలాయపల్లి పీహెచ్‌సీ వైద్యులు ప్రమీల కోరారు. పీహెచ్‌సీలో శనివారం వైద్య సిబ్బందితో కలిసి నిరసన తెలిపారు.







సైదాపురంలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, వెంకటగిరి రూరల్ : డీటీకి వినతి పత్రం ఇస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నేతలు, నాయుడుపేటలో...